సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 30 । మార్చి । 2024



సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి IIలో

సింహగిరిపై స్వామి వారికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు.



వైభవంగా వారాంతపు పూజలు

విశాఖ రుషికొండలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
పాడేరు, అరకు	6.13	4.37
రంపచోడవరం	6.28	4.42

న్యూస్‌రీల్

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



స్వామివారి సేవా కార్యక్రమంలో భక్తులు, అధికారులు

రంపచోడవరం: ఇక్కడికి సమీపంలోని గోవింద గిరిపై టీటీడీ నిర్మించిన శ్రీవారి ఆలయానికి శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు సాయిరామశర్మ వేదపారాయణం చేశారు. ఆలయ అర్చకులు మణికంఠస్వామి, పార్థస్వామి శ్రీవారికి అభిషేక సేవ నిర్వహించారు. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటుచేశారు. రంపచోడవరం ధర్మ ప్రచార సేవా భక్త మండలి సమన్వయ కర్త నల్లమిల్లి వెంకట రామారెడ్డి మాట్లాడుతూ శ్రీవారి సేవకులు సహాయకులుగా వంట, వడ్డన చేశారని తెలిపారు. శనివారం కూడా భక్తులకు రాజమహేంద్రవరానికి చెందిన గురుప్రసాద్ అన్న సమారాధన ఏర్పాటుచేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఆలయ అధికారి శివరామ్ పాల్గొన్నారు.

జగనన్నకు అన్నివర్గాల మద్దతు

- వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం



గ్రామస్తులతో మత్స్యలింగం

అరకులోయ రూరల్: జగనన్న ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇస్తున్నారని అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం తెలిపారు. శుక్రవారం ఆయన మాడల, గన్నెల, ఇరగాయి పంచాయతీల్లో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతల తప్పుడు హామీలను నమ్మవద్దని సూచించారు. ఎన్నడూ లేనివిధంగా రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించి ఆయనను ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీలు రాంచందర్, శత్రుఘ్న, సర్పంచ్ బొజ్జ పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి

- ఎమ్మెల్సీ అనంతబాబు



అడ్డతీగల సినిమాహాలు కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: ఐదేళ్లలో ఎన్నడూలేనివిధంగా ఎంతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. శుక్రవారం ఆయన అడ్డతీగలలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సినిమాహాలు కాలనీ, వాల్మీకి నగర్, సీతారామరాజు కాలనీ, కార్పెంటర్ కాలనీల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఐదేళ్లలో అమలు చేసిన పథకాలు సంక్షేమానికి చిరునామాగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల రూపంలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. అడ్డతీగల పంచాయతీలో రూ.17 కోట్ల సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన మరింత చేరువైందన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ గుమ్మా తనూజారాణిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు నాటు తుపాకులు అప్పగింత

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): మండలంలోని గుంటసీమ పంచాయతీ సోబూరు గ్రామానికి చెందిన గెద్దంగి డొయితరి అనే వ్యక్తి తన వద్ద ఉన్న రెండు నాటు తుపాకులను శుక్రవారం అప్పగించినట్టు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు. నాటు తుపాకీలు కలిగి ఉన్న వారు వెంటనే స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమకు అప్పగించాలని ఆయన కోరారు. నగదు బహుమతి అందజేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

కూటమి బూటకం

- ఎక్కడికక్కడే ఒంటరి పోరాటం
- నియోజకవర్గాల్లో పొసగని పొత్తు
- తలోదారిలో టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడరు
- అభ్యర్థుల ప్రచారానికి ఆమడ దూరం
- బరిలో నిలిచిన కూటమి అభ్యర్థుల్లో ఓటమి భయం



సాక్షి, విశాఖపట్నం : తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిలో పొత్తులు పొసగడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో వీరు ఒకరికొకరు సహకరించుకోవడం లేదు. ఆ పార్టీల ముఖ్య నేతలు, శ్రేణులు ఈ ఎన్నికల్లో తామంతా కలిసి ముందుకు వెళ్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించినా వారి తరఫున ప్రచారానికి కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. అక్కడక్కడ అంటీముట్టనట్టు మొక్కుబడిగా కనిపిస్తున్నారు. దీంతో అభ్యర్థులు ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పేరుకే పొత్తులు తప్ప లోలోపల 'మిత్రులకు' సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. దీంతో ఇప్పట్నుంచే కూటమి అభ్యర్థులకు ఓటమి భయం వెంటాడుతోంది.

- విశాఖ ఉత్తరం పొత్తులో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు దక్కింది. ఆ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన క్యాడరు ఆయన వెంట ప్రచారానికి సుముఖత చూపడం లేదు. ఈ సీటు ఆశించిన పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేటి రఘులను ఇప్పుడు ప్రసన్నం చేసుకునే పనిలో విష్ణుకుమార్‌రాజు ఉన్నారు. అక్కడ అంతంతమాత్రంగా ఉన్న టీడీపీలో సరైన నాయకుడే లేదు. ఉన్న అరకొర నాయకులూ బీజేపీ అభ్యర్థి వెంట నడవడం లేదు.
- విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడికి బీజేపీ, జనసేన శ్రేణులు దూరంగా ఉంటున్నారు. దీంతో తన అనుచరులతోనే వెలగపూడి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.
- విశాఖ 'పశ్చిమ'లో టీడీపీ అభ్యర్థి గణబాబుకు మద్దతుగా బీజేపీ, జనసేన సీనియర్లు ప్రచారంలో పాల్గొనడం లేదు. తమకు సహకరించాలని గణబాబు తన వర్గీయులను పంపుతున్నా అటు నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదు.

> - పొత్తులో విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించారు. ఈయన అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీలో సీటును ఆశించిన ముగ్గురు ముఖ్య నేతలు షాదిక్, కందుల నాగరాజు, మూగి శ్రీనివాసరావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరు వంశీకి సహకరించే ప్రసక్తే లేదని తెగేసి చెబుతున్నారు. ఈ సీటుపై టీడీపీ నుంచి అక్కడ ఇన్‌చార్జి గండి బాబ్జీ గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ జనసేనకు ఖరారు చేయడంతో రాజీనామా చేస్తానని బెదిరించారు. ఆ తర్వాత చంద్రబాబు బుజ్జగించడంతో మెత్తబడినా పూర్తి స్థాయిలో వంశీ కోసం పనిచేస్తారన్న నమ్మకం లేదు. ప్రస్తుతం వంశీకృష్ణ తన అనుచరులతోనే దక్షిణలో ప్రచారం చేసుకుంటున్నారు.

- పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడంతో ఆ సీటు తనకే ఖాయమనుకున్న టీడీపీకి చెందిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. తన అనుచరులను రోజూ రోడ్డెక్కించి ఆందోళనలు చేయిస్తున్నారు. దీంతో అక్కడ జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు టీడీపీ నుంచి సహకారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. దీంతో జనసేన క్యాడరుతోనే ఒంటరిగా ప్రచారం చేసుకుంటున్నారు.
- యలమంచిలి సీటును జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు కేటాయించారు. ఈయన అభ్యర్థిత్వాన్ని అక్కడ సీటును ఆశించిన టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అంగీకరించడం లేదు. ప్రగడ అనుచరులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి పార్టీ కార్యాలయంలో ఫర్నిచరును కూడా ధ్వంసం చేశారు. జనసేన అభ్యర్థికి మద్దతుగా ప్రచారానికి ముందుకు రావడం లేదు.
- ఇక చోడవరంలోనూ అదే పరిస్థితి. టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ రాజుకు టికెట్టు ఇవ్వడాన్ని అక్కడ జనసేన, బీజేపీ నాయకులకు ఇష్టం లేదు. అందువల్ల రాజు ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి వీరు సుముఖత చూపడం లేదు.
- మాడుగులలో విచిత్రమైన పరిస్థితి ఉంది. అక్కడ పైలా ప్రసాద్‌కు టీడీపీ సీటు ఇవ్వడాన్ని ఆ పార్టీకే చెందిన మాజీ ఎమ్మెల్యే రామానాయుడు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన వర్గీయులెవరూ ప్రసాద్ ప్రచారంలో పాల్గొనడం లేదు. ఇక జనసేన, బీజేపీ నాయకులూ ప్రచారానికి వెళ్లడం లేదు.
- పాయకరావుపేట టీడీపీ టికెట్టు అనితకిచ్చారు. ఆమె అభ్యర్థిత్వాన్ని అక్కడ జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి వర్గీయులతో పాటు టీడీపీలోని ఒక వర్గం ఎప్పట్నుంచో ససేమిరా అంటోంది. ఇటీవలే బుజ్జి వర్గాన్ని బుజ్జగించినా ప్రచారంలో పాల్గొనడంపై ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. బీజేపీ ముఖ్య నాయకులు కూడా ఆమె వెంట కనిపించడం లేదు.
- ఇక రంపచోడవరం సీటు టీడీపీ అభ్యర్థి శిరీషకు దక్కింది. ఆమెకు టికెట్టు ఇవ్వడంపై అక్కడ మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, వెంకటేశ్వరరావులు గుర్రుగా ఉన్నారు. దీంతో శిరీషకు సొంత పార్టీ వారి మద్దతు ప్రశ్నార్థకంగా మారింది.

'గిడ్డి'కి భంగపాటు



వైఎస్సార్‌సీపీ తరపున గెలుపొంది పార్టీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి భంగపాటు తప్పలేదు. పాడేరు సీటు కోసం విశ్వ ప్రయత్నం చేసిన ఆమెను కూరలో కరివేపాకు మాదిరిగా చంద్రబాబు పక్కన పడేశారు. ఆమెకు కాకుండా మరొకరికి టికెట్ కేటాయించడంతో ఆయన తీరుపై అనుచరులంతా రగిలిపోతున్నారు. వీరంతా పార్టీ ప్రకటించిన అభ్యర్థికి సహకరించేది లేదని స్పష్టం చేశారు.

- దక్కని పాడేరు టీడీపీ టికెట్
- ఝలక్ ఇచ్చిన చంద్రబాబు
- రగిలిపోతున్న అనుచరులు
- గ్రూపులుగా విడిపోయిన ఆ పార్టీ శ్రేణులు

సాక్షి, పాడేరు: టీడీపీ పాడేరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. గత ఏడేళ్లుగా టీడీపీ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టిన ఆమెకు పాడేరు అసెంబ్లీ టికెట్ ఇస్తారని అనుచరులంతా ఆశించారు. ఈ సీటు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆమెను చంద్రబాబు పక్కనబెట్టారు. దీంతో ఆమె అనుచరులు, టీడీపీ శ్రేణులు చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. ఈ సీటును తొలుత బీజేపీకి కేటాయించినట్టు ప్రచారం జరిగింది. అప్పటి నుంచి టీడీపీలో ఈశ్వరితో పాటు మరికొంతమంది ఆశావహులంతా చంద్రబాబుపై గుర్రుగా ఉన్నారు. మొన్నటి వరకు బీజేపీ పోటీ చేస్తుందని భావించినప్పటికీ అరకులోయ అసెంబ్లీ స్థానాన్ని తీసుకున్న ఆ పార్టీ పాడేరు సీటును టీడీపీకి వదిలేసింది. దీంతో మళ్లీ గిడ్డి ఈశ్వరి పాడేరు టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేశారు. ఆమెతోపాటు కిల్లు రమేష్‌నాయుడు, కొట్టగుళ్లి సుబ్బారావు, ఎంవీవీఎస్ ప్రసాద్ కూడా ప్రయత్నించారు. వీరిలో కిల్లు రమేష్‌నాయుడు పేరును టీడీపీ ప్రకటించడంతో గిడ్డి ఈశ్వరితోపాటు మిగిలిన వారంతా కంగుతిన్నారు.

ఆ రోజు వెన్నుపోటుకు బదులా..?

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఫ్యాన్ గుర్తుపై 2014 ఎన్నికల్లో పాడేరు ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి ఈశ్వరి 2018లో పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరారు. సంతల్లో పశువుల మాదిరిగా చంద్రబాబు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. ఆమె కూడా ప్యాకేజీకి ఆశపడి పార్టీ ఫిరాయించారు. నమ్మి సీటు ఇచ్చిన వైఎస్సార్‌సీపీకి, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఆమె ద్రోహం చేశారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో పాడేరు టీడీపీ టికెట్ సీటు గిడ్డి ఈశ్వరికి చంద్రబాబు ఇచ్చినప్పటికీ ప్రజలు ఆదరించలేదు. అప్పటిలో ఆమె ఘోర పరాజయం పాలయ్యారు. వైఎస్సార్‌సీపీకి ఆమె చేసిన ద్రోహానికి ప్రజలు ఓటుతో తగిన గుణ పాఠం చెప్పారు. ఆ తరువాత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసినప్పటికీ ఆమెకు వ్యతిరేకంగా మరో వర్గం పార్టీ కార్యక్రమాలు చేపట్టింది. దీంతో పార్టీ శ్రేణులు గ్రూపులుగా విడిపోయారు. గిడ్డి వ్యతిరేక వర్గీయులంతా నారా లోకేష్‌తో టచ్‌లో ఉండేవారు. ప్రస్తుతం పాడేరు టికెట్ పొందిన కిల్లు రమేష్‌నాయుడు కూడా నారా లోకేష్‌ను తరచూ కలుస్తుండేవారని తెలిసింది. గత నెలలో పాడేరు వచ్చిన చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కూడా ఈశ్వరికి పాడేరు సీటు కోసం హామీ ఇచ్చారు. ఆమె పర్యటన ఏర్పాట్లకు ఈశ్వరి భారీగానే ఖర్చు పెట్టారు. కానీ ఆమె సీటు విషయంలో భువనేశ్వరి కూడా ఏమీ చేయలేక పోవడంతో గిడ్డి ఈశ్వరికి భంగపాటు తప్పలేదు. సీటు కేటాయింపు విషయంలో పార్టీ నిర్ణయం మార్చుకోకుంటే టీడీపీ అభ్యర్థికి సహకరించేది లేదని పార్టీ అధిష్టానాన్ని గిడ్డి అనుచరులు హెచ్చరించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

ఎన్ని జిమ్మిక్కులు చేసినా
వైఎస్సార్‌సీపీదే విజయం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వైఎస్సార్ సీపీదే విజయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమి భయంతోనే టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తుతో ముందుకు వస్తున్నాయన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు కూటమి అభ్యర్థులకు లేదన్నారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ శ్రేణులు విచ్చలవిడిగా దోచుకున్నాయన్నారు. ప్రజలకు మరింత సుపరిపాలన కోసం జగనన్నను మళ్లీ సీఎంను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలంతా తమ ప్రభుత్వం వైపే ఉన్నా రన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అరకు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి నర్సింహమూర్తి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, సర్పంచ్ బొజ్జ పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్లలో మౌలిక వసతులు

- ఎస్పీ తుహిన్ సిన్హా



పోలీసు బ్యారక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

జి.మాడుగుల: పోలీసుస్టేషన్లలో సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన పోలీస్ బ్యారెక్ (పోలీస్ మెన్ క్వార్టర్) భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో బ్యారెక్ భవనాలు ఉండటం వల్ల సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఇక్కడ నాలుగు గదులతో నిర్మించిన భవనంలో సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎస్పీ ధీరజ్, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి 198 బెటాలియన్ రాజా కేసీ, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ ఉదయ్‌కుమార్, సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు



పాడేరులో టీడీపీ కరపత్రాలు, ఫ్లెక్సీలకు నిప్పంటించి దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు

- పాడేరు అసెంబ్లీ టీడీపీ టికెట్ కిల్లు రమేష్‌నాయుడుకు కేటాయింపుపై తీవ్రస్థాయిలో నిరసన
- చంద్రబాబు ఫ్లెక్సీలు, కరపత్రాలకు నిప్పు
- గిడ్డికి కేటాయించకుంటే పార్టీకి రాజీనామాలు చేస్తామని స్పష్టీకరణ
- పునరాలోచించకుంటే ఆమెను బరిలో నిలుపుతామని అధిష్టానానికి హెచ్చరిక
- నేటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

సాక్షి,పాడేరు: పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కిల్లు రమేష్‌నాయుడును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించడంతో తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. చంద్రబాబు ఫొటోతో ఉన్న ఫ్లెక్సీలు, పార్టీ కరపత్రాలకు నిప్పంటించి దహనం చేసి తీవ్ర స్థాయిలో నిరసనలు తెలిపారు. కిల్లు రమేష్‌నాయుడు పేరు ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం పాడేరు కుమ్మరిపుట్టులోని తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అనుచరులతో సమావేశం నిర్వహించారు. ఆమెతో పాటు పార్టీ శ్రేణులు రమేష్‌నాయుడు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. నియోజకవర్గ ప్రజలకు ఏమాత్రం తెలియని వ్యక్తికి ఎలా టికెట్ కేటాయిస్తారని టీడీపీ అధిష్టానం తీరుపై వారు మండిపడ్డారు. రూ.కోట్లకు అమ్ముడుపోయి టికెట్ కేటాయించారని వారంతా ధ్వజమెత్తారు. అనంతరం గిడ్డి ఈశ్వరి నివాసానికి చేరువలో చంద్రబాబు ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలు, పార్టీ ప్రచార కరపత్రాలకు నిప్పటించి దహనం చేశారు. టికెట్ కేటాయింపు విషయంలో అధిష్టానం పునరాలోచించకుంటే రమేష్‌నాయుడును ఓడిస్తామని హెచ్చరించారు. తామంతా పార్టీకి రాజీనామా చేసి గిడ్డి ఈశ్వరిని బరిలో నిలుపుతామని హెచ్చరించారు. అధిష్టానం తీరుకు నిరసనగా గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇవ్వాలన్న డిమాండ్‌తో శనివారం నుంచి నియోజకవర్గంలో ఆందోళనలు చేపట్టాలని వారు పిలుపునిచ్చారు.



కొయ్యూరులో టీడీపీ ఫ్లెక్సీని తగులబెడుతున్న ఆ పార్టీ కార్యకర్తలు

ఎంవీవీ ప్రసాద్‌కు టికెట్ ఇవ్వలేదని..

కొయ్యూరు: టీడీపీ సీనియర్‌నేత ఎంవీఎస్ ప్రసాద్‌కు పాడేరు అసెంబ్లీ సీటు కేటాయించక పోవడంపై ఆ పార్టీ స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రమేష్‌నాయుడుకు టికెట్ కేటాయించడంపై వారంతా నిరసన వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని పని చేస్తున్న ప్రసాద్‌కు పార్టీ అధిష్టానం అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. అనంతరం శుక్రవారం రాత్రి కొయ్యూరు జంక్షన్‌లో ఆందోళన చేశారు. టీడీపీ ఫ్లెక్సీలను తీసుకువచ్చి తగులబెట్టారు. టీడీపీ అధిష్టానం వెంటనే పార్టీ టికెట్‌ను ప్రసాద్‌కు కేటాయించాలని లేకుంటే మరో నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు తెలియని వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారని వారంతా మండిపడ్డారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న ప్రసాద్ కుటుంబానికి అన్యాయం చేయడం తగదని వారు ధ్వజమెత్తారు.

వెంకన్నకు క్షీరాభిషేకం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం క్షీరాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

ఎన్నికల వేళ.. మరింత అప్రమత్తం

- దండకారణ్యంలో జల్లెడ పడుతున్న బలగాలు
- అప్రమత్తమైన నాలుగు రాష్ట్రాల పోలీసు యంత్రాంగం
- ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణే లక్ష్యం



ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మోహరించిన గ్రేహౌండ్స్ బలగాలు



ముంచంగిపుట్టులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి,పాడేరు: ఏపీతో పాటు సరిహద్దు ఒడిశాలోను సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ ముందస్తుగానే పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. తీవ్రవాద కార్యకలాపాలు నిర్మూలన లక్ష్యంగా దండకారణ్యంలో పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే లక్ష్యంగా పోలీసుశాఖ వ్యూహాత్మకంగా చర్యలు చేపట్టింది. తెలంగాణ, ఏపీలో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గినప్పటికీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయి.

సరిహద్దు ప్రాంతాల్లో మరింత నిఘా

ఇటీవల కాలంలో మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్‌లో ఉనికిని చాటుకునే లక్ష్యంగా హింసాత్మక ఘటనలకు పాల్పడుతోంది. పోలీసు బలగాలు, మావోయిస్టు పార్టీల మధ్య ఎదురుకాల్పుల ఘటనలు అధికమయ్యాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ, ఏపీ, ఒడిశా రాష్ట్రాల పోలీసు యంత్రాంగం సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచింది. జిల్లాలోని పోలీసు బలగాలతో పాటు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా, ఒడిశాలోని కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలకు చెందిన పోలీసు బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేసి జల్లెడ పడుతున్నాయి.

- జిల్లాలోని రంపచోడవరం, పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 610 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర హోంశాఖలు ఇప్పటినుంచి బలగాలను రంగంలోకి దింపాయి.
- గాలింపు చర్యల్లో 19 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు, 40 గ్రేహౌండ్స్ బలగాలు, 55 స్పెషల్ పార్టీ బలగాలు నిమగ్నమయ్యాయి. అటువైపు నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన పోలీసు బలగాలు మోహరించాయి.
- జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఆరు అవుట్ పోస్టులలోను అదనపు పోలీసు బలగాలు స్థానికంగా తనిఖీలు ముమ్మరం చేశాయి. దీనిలో భాగంగా రోడ్లు, కల్వర్టులను బాంబు స్క్వాడ్‌లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. అనుమానితుల నుంచి వివరాలు తెలుసుకుని విడిచిపెడుతున్నాయి. మరో ఆరు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున పోలీసు బలగాలను అందుబాటులో ఉంచారు.

సరిహద్దులో రాకపోకలపై దృష్టి

ముంచంగిపుట్టు: ఆంధ్రా– ఒడిశా సరిహద్దు ప్రాంతంలో రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి రూడకోట,జోలాపుట్టు వెళ్లే మార్గాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు బాంబ్ స్క్వాడ్ కల్వర్టులు, వంతెనలను క్షుణ్ణంగా పరిశీలించాయి. కించాయిపుట్టు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు,లగేజీలను పరిశీలించి విడిచిపెట్టారు. రాత్రివేళలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

తనిఖీలు విస్తృతం



> సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలన్న లక్ష్యంతో పక్రాళికపరంగా చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో తనిఖీలను విస్తృతం చేశాం. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణంగా పకడ్బందీగా చర్యలు చేపట్టాం.
>
> – తుహిన్ సిన్హా, ఎస్పీ, పాడేరు

పదో తరగతి మూల్యాంకనంపై ప్రత్యేక దృష్టి

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానంద్ రెడ్డి సూచించారు. జ్ఞానాపురం జూబ్లీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూల్యాంకనం కేంద్రాన్ని శుక్రవారం ఆయన డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి పరిశీలించారు. కేంద్రంలోని అన్ని గదులను తనిఖీ చేశారు. విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో పాత పోస్టాఫీసు సెంటర్‌లో ఉన్న క్వీన్‌మేరీ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మూల్యాంకనం కేంద్రం ఉండేదని, మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా ఈ ఏడాది జ్ఞానాపురం జూబ్లీ హైస్కూల్‌కు మార్పు చేసినట్లు డీఈవో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల జిల్లా కమిషనర్ మురళీ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేంద్రంలోని గదులను పరిశీలిస్తున్న దేవానంద్‌రెడ్డి, చంద్రకళ

క్లుప్తంగా

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతుడు యేసు(ఫైల్)

కొయ్యూరు: ఈ నెల 26న నడింపాలెం వంతెన వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురైన మామిడి ప్రసాద్(యేసు–35) శుక్రవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. చీడిపాలెం పంచాయతీ సింగవరానికి చెందిన యేసు మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. నడింపాలెం వంతెన వద్ద బండి అదుపు తప్పి వంతెన స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో పాటు ఛాతీపై కూడా దెబ్బ తగిలింది. వెంటనే రాజేంద్రపాలెం ఆస్పత్రిలో ప్రథమ చికిత్సచేసి, మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. రెండు రోజులు చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. యేసు మరణంతో సింగవరంలో విషాదం నెలకొంది.

శిరిజాంలో అగ్ని ప్రమాదం

చీడికాడ: మండలంలోని శిరిజాంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 10 పశువుల పాకలు, గడ్డివాములు, ధాన్యం పురులు, చింత చెట్లు దగ్ధమై రూ.7 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి ఆనుకుని ఉన్న గుంపాన వారి కళ్లాల్లో మధ్యాహ్నం 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు రవ్వలు పడి, గుంపాన ఎర్రినాయుడు పాకపై మంటలు చెలరేగాయి. గాలి వీచడంతో అగ్నికీలలు ఒక్కసారిగా దావానంలా వ్యాపించి పక్కనే ఉన్న గుంపాన దేముళ్లు, గుంపాన ఈశ్వరరావు, గంగునాయుడు, సన్యాసిరావు, తులసీరావు, ముసిలినాయుడు, నరసింహుడు, శేషుబాబు, దేముడమ్మ, నాగేశ్వరరావు, అచ్చిబాబు, వెంకటరమణ, లక్ష్మణలకు చెందిన పశువుల పాకలు, 5 గడ్డివాములు, 2 ధాన్యం పురులు, 10 చింతచెట్లు ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న మాడుగుల అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపు చేశారు.

'ఉత్తర' కుమారుడు.. మళ్లీ భీమిలికి..

- ఎన్నికకో నియోజకవర్గం మారుతున్న గంటా
- సంచార రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరు
- చివరి నిమిషంలో భీమిలి టికెట్ కేటాయించిన చంద్రబాబు
- ఉత్తరంలో గెలిచిన ఐదేళ్లలో జనానికి ముఖం చాటేసిన వైనం
- ఇప్పుడు భీమిలి ప్రజల్ని మరోసారి మోసం చేసేందుకు పయనం



సాక్షి, విశాఖపట్నం : ఆయనో రాజకీయ సంచారజీవి.. పిల్లిపిల్లలను మార్చిన చందంగా ఎన్నికలకో నియోజకవర్గం మారుస్తూ.. పోటీ చేసిన ప్రతి నియోజకవర్గంలో ప్రజల్ని ఏమారుస్తూ.. గెలిచిన తర్వాత.. ఓటర్లను మోసం చేస్తూ.. చివరి నిమిషంలో అక్కడి నుంచి జంప్ అయిపోతారు. ఎన్నికలకో సెగ్మెంట్ మారుస్తున్న గంటా శ్రీనివాసరావు అడ్డగోలు సంపాదన, స్థిర, చరాస్తులను కూడబెట్టడంలో మాత్రం ఏకరీతినే దూసుకుపోయారు. నిన్న మొన్నటి వరకూ టికెట్ కోసం అధిష్టానం చుట్టూ కాళ్లరిగేలా తిరిగే స్థితికి చేరుకున్న గంటాకు.. చీపురుపల్లిలో పోటీ చేయాల్సిందేనని చంద్రబాబు తేల్చి చెప్పగా.. చివరికి బతిమాలుకొని భీమిలి టికెట్ సంపాదించుకున్నారు. ఈ ఎన్నికల్లో తన వలస రాజకీయంతో మరోసారి భీమిలి ప్రజలను మోసం చేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రకాశం జిల్లా నుంచి బతుకుదెరువు కోసం విశాఖకు వలస వచ్చి ఓ దినపత్రికలో యాడ్ ఎగ్జిక్యూటివ్‌గా జీవితాన్ని ప్రారంభించాడు. చిరుద్యోగిగా ఆదాయ ప్రస్థానం మొదలుపెట్టిన గంటా.. ఆ తర్వాత షిప్పింగ్ రంగంలో వ్యాపారవేత్తగా ఎదిగారు. 1999లో అనూహ్య రీతిలో టీడీపీ తరఫున అనకాపల్లి ఎంపీగా, ఆ తర్వాత 2004లో చోడవరం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా, 2009లో ప్రజారాజ్యం తరఫున అనకాపల్లి ఎమ్మెల్యేగా, 2014లో భీమిలి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా, 2019లో విశాఖ ఉత్తర ఎమ్మెల్యేగా గెలుపొందారు. నిజానికి 1999లో ప్రజాప్రతినిధిగా రాజకీయ జీవితం మొదలుపెట్టినా.. కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం విలీనమైన పరిణామాల నేపథ్యంలో 2011లో తొలిసారి మంత్రి బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి క్రమక్రమంగా ఆరోపణలు వెల్లువెత్తుతూ వచ్చాయి. ఇక 2014లో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో గంటాకు మళ్లీ మంత్రి పదవి రావడం దరిమిలా మొదలైన అవినీతి, అక్రమార్జన పర్వం, దోపిడీ పరాకాష్టకు చేరుకుంది.

అంతులేని గంటా గ్యాంగ్ దందాలు

ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా లెక్క చెయ్యకుండా.. అవినీతిని కొనసాగించడమే గంటా స్టైల్. గంటా విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీలో ఉంటున్న బహుళ అంతస్తుల భవంతితో పాటు.. ప్రత్యూష పేరుతో కంపెనీ స్థాపించి.. రూ.200 కోట్లకు పైగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టేశారు. దీంతో సదరు ఇండియన్ బ్యాంకు గంటా అండ్ కో అడ్డగోలుగా సంపాదించిన పలు స్థలాల్ని వేలం వేస్తుండగా.. మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంది. గంటా దోపిడీ పర్వాన్ని మొత్తం లెక్క కడితే రూ.వందల కోట్లపైనే ఉంటుందని టీడీపీ నేతలే అంచనా వేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకూ గంటా గ్యాంగ్ భీమిలిలో సాగించిన భూదందాలతో మళ్లీ అక్కడ మొఖం చూపించలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. నమ్ముకొని ఓటేసిన భీమిలి ప్రజలకు ఏమాత్రం మంచి చెయ్యకుండా కనిపిస్తే కబ్జా పేరుతో దందా సాగించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు అండ్ కో విశాఖలో భూ దందాలకు తెగబడినప్పుడు కీలక సూత్రధారి గంటాయేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గంటా శ్రీనివాసరావే భూదొంగ అంటూ అదే పార్టీకి చెందిన సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడే స్వయంగా సిట్‌కు ఫిర్యాదు చేయడంతో కలకలం రేగింది. అక్రమాల ఆరోపణలు చుట్టుముట్టడంతో తరుణంలో భీమిలి నుంచి ఎలాగైనా తప్పించుకోవాలని గంటా నిర్ణయించుకున్నారు.

ఓటేసిన జనాన్ని లెక్క చేయని గంటా..

తాను చేసిన అక్రమాలు, అవినీతి పనులు బట్టబయలు కావడంతో 2019 ఎన్నికల్లో భీమిలి ప్రజలు ఛీకొడతారని ముందుగానే ఊహించిన గంటా.. వ్యూహాత్మకంగా బీజేపీకి కేటాయించిన విశాఖ ఉత్తర సీటును దక్కించుకున్నారు. ఎలాగోలా భీమిలి నుంచి బయటపడి టికెట్ తెచ్చుకున్న గంటా.. ఎన్నికల సమయంలో ఉత్తర నియోజకవర్గ ప్రజల్ని మోసపూరిత హామీలతో మభ్యపెట్టారు. పోలింగ్ సమయంలో చివరి నిమిషంలో బర్మాక్యాంపు తదితర కొండవాలు ప్రాంతాల్లో దొంగ ఓట్ల వ్యవహారంతో గట్టెక్కి విజయం సాధించారు. అంతే ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత నేటి వరకూ ఉత్తర ప్రజలకు ఒక్కసారైన మొహం చూపించకుండా ఎంవీపీలోనే తిష్టవేసుక్కూర్చున్నారు. తాము ఓటేసి గెలిపించిన పాపానికి తగిన శాస్తి జరిగిందంటూ ఆవేదన చెందుతున్న నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు అండగా నిలబడ్డారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. ఈసారి ఉత్తరంలో పోటీ చేస్తే.. ఓటమి తప్పదని భావించిన గంటా.. మరోసారి భీమిలికి వెళ్లిపోవాలని అక్కడి నేతలతో మంతనాలు ప్రారంభించారు. గెలుపొందిన చోట్ల దోపిడీకి పాల్పడే గంటా చేతిలో మరోసారి తాము మోసపోయే స్థితిలో లేమని భీమిలి ప్రజలంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. అయినా నిస్సిగ్గుగా భీమిలిని దోచుకునేందుకు గంటా మళ్లీ బయలుదేరడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ విజయమే మనందరి లక్ష్యం

- జగనన్నే మళ్లీ మన ముఖ్యమంత్రి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


కొమరాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి


వంచంగిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను గ్రామస్తులకు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: మన ప్రియతమ నేత జగనన్నే మళ్లీ మన ముఖ్యమంత్రి అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి , ఉభయగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ స్పష్టం చేశారు. మండలంలోని చికిలింత, వంచంగి, లోదొడ్డి, వాతంగి, మారేడుబాక పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయమే మనందరి లక్ష్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తనూజా రాణి, ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిను గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు, సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వారికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అడుగడుగున పూల వర్షం కురిపిస్తు, దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

మీ అభిమానం మరువలేనిది: ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి మీ ఇంటి ముంగిళ్ళకు వచ్చి నిత్యం మీ తోనే గడిపానని, మీ సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేశానని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు పరచిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా మీ అందరి సహాయ సహకారాలతో అమలు చేయగలిగామన్నారు. మీ అభిమానం ఎన్నటికీ మరువలేనిదని ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మరోసారి మీకు సేవ చేసుకొనే భాగ్యం కల్పించాలని ప్రతి ఒక్కరిని కలిసి విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, శుభలక్ష్మి, తొంట ఆదిరాజు, గణలక్ష్మి, శుభలక్ష్మి, కాంతం, చంద్రుడు, నాయకులు శాంతకుమారి, అర్జున్, దుర్గాప్రసాద్, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి

సింహాచలం(విశాఖ): సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహించారు.

స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి సూర్యప్రభ వాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అణువణువు..ఆధ్యాత్మికతకు నెలవు

సాగరతీరాన కొలువుదీరిన సప్తగిరుల వెంకన్న


శ్రవణ నక్షత్రంలో నిర్వహించే తిరు మంజనం

కొమ్మాది (విశాఖ): శ్రీ వారి ఆలయం అణువణువు ఓ అద్భుతమే. సాగర తీరానికి అభిముఖంగా ఉత్తరాంధ్ర వైకుంఠధామంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పది ఎకరాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని టీటీడీ నిర్మించింది. 1.5 ఎకరాల్లో ప్రధాన ఆలయ నిర్మాణం జరిగింది. కొండపైకి రోడ్డు మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆర్చి నుంచి లోపలికి అడుగిడగానే ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా పూల మొక్కలు, శ్రీవారి నామాలు, పూలకుండీలు స్వాగతిస్తాయి. తిరుమల లో శిల్ప కళాకారులు రూపొందించిన శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహంతో పాటు ఆంజనేయ స్వామి, శ్రీవారి పాదాలు, భూదేవి విగ్రహాలు భక్తి భావనను ఇనుమడింపజేస్తాయి.

ప్రత్యేక పూజలు

శ్రీవారి ఆలయంలో సాధారణ రోజుల్లో పూజలతో పాటు ప్రత్యేక దినాల్లో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతీ నెల శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్నపన తిరుమంజనం, ప్రతీ శుక్రవారం వారాభిషేకంలో భాగంగా శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ, భోగి నాడు గోదాదేవి కల్యాణం జరిపిస్తున్నారు. ఏటా మూడు పర్యాయాలు వైకుంఠ ఏకాదశి, ఉగాది, బ్రహ్మోత్సవాల ముందు మంగళవారం నాడు కోయల్ ఆల్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతీ శనివారం కోలాటాలు, శ్రీవారి నామ సంకీర్తన తదితర కార్యక్రమాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తుంటాయి. రాష్ట్రం నలుమూలల నుండి అనేక మంది మహిళలు పెద్ద ఎత్తున శ్రీవారి సేవ చేసేందుకు వస్తుంటారు.

శ్రీవారి ఆలయాన్ని చేరుకునే మార్గం

శ్రీవారి ఆలయానికి జిల్లా నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. ఆలయానికి చేరుకునేందుకు కొండపైకి ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు మాత్రమే అనుమతిస్తున్నారు. ఆటోలకు అనుమతి లేదు. కొండ చిన్నది కావడంతో భక్తులు నడిచి ఆలయాన్ని చేరుకోవచ్చు. కొండ దిగువ నుంచి కొండపై శ్రీవారిని చేరుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉంది. రాత్రి 7.30 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలకు అనుమతిస్తున్నారు.

వార్షికోత్సవానికి సన్నాహాలు

ఈ నెల 30వ తేదిన శ్రీవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా 26వ తేదీన కోయల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. 30వ తేదీన ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. శ్రీవారి ఆలయానికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈవో జగన్ మోహనాచార్యులు తెలిపారు.


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆటగాళ్లు పృథ్వీషా, ఇషాంత్ శర్మ, కుల్దీప్ యాదవ్, హోప్, విక్కీ, అక్షర్ పటేల్

గెలుపెవరిది?

- రేపు డీసీతో సీఎస్‌కే మ్యాచ్
- విశాఖ చేరిన ఆటగాళ్లు


ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు ముఖేష్‌కుమార్, డైరెక్టర్ గంగూలీ, హెడ్ కోచ్ రికీ పాంటింగ్

విశాఖ స్పోర్ట్స్/గోపాలపట్నం: ఐపీఎల్‌లో భాగంగా తలపడేందుకు ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) జట్లు శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకున్నాయి. ఇరు జట్లకు విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. క్రికెటర్లను తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు. రెండు జట్ల సభ్యులు ప్రత్యేక బస్సుల్లో రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్ వెళ్లారు. పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం ఇరు జట్లు తలపడనుండగా.. శనివారం ప్రాక్టీస్ చేయనున్నాయి. ఈ మ్యాచ్ టికెట్లు హాట్‌కేక్‌లా నిమిషాల వ్యవధిలోనే అమ్ముడుపోయిన సంగతి తెలిసిందే.

ప్రస్తుత 17వ ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో ఆర్‌సీబీ మినహా హోం గ్రౌండ్ జట్లే విజయకేతనం ఎగురవేస్తున్నాయి. డీసీ ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైంది. డీసీ విశాఖను తొలి సెషన్ మ్యాచ్‌లకు హోం గ్రౌండ్‌గా ఎంచుకుంది. ఇక డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఇప్పటికే సీఎస్‌కే ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. అయితే ఈ రెండు మ్యాచ్‌లను హోం గ్రౌండ్‌లోనే ఆడి గెలిచింది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఇదే ఊపును సీఎస్‌కే కొనసాగిస్తుందా లేక హోం గ్రౌండ్ సెంటిమెంట్‌తో డీసీ గెలుపునకు శ్రీకారం చుడుతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఆ రోజు రాత్రి 7.30 గంటలకు వైఎస్సార్ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్ ప్రారంభం కానుంది.

డీసీతో సీఎస్‌కే మ్యాచ్‌కు సిద్ధం

విశాఖ స్పోర్ట్స్: ఈ నెల 31న డీసీతో తలపడే సీఎస్‌కే మ్యాచ్‌కు వైఎస్సార్ స్టేడియం సిద్ధమైందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీస్ అధికారుల సహకారంతో బీసీసీఐ నిబంధనల మేరకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి నాయకత్వంలో నాలుగేళ్లలో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించడంతోనే ఐపీఎల్ మ్యాచ్‌లు కేటాయించారన్నారు. ఏసీఏ ఆధ్వర్యంలో క్రీడాకారులు, మ్యాచ్ నిర్వహణ సిబ్బందికి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న, చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాళ్లు రుతురాజ్, రవీంద్ర జడేజా, రచిన్ రవీంద్ర, బ్రావో, శార్దూల్ ఠాకూర్